# మేడ్చల్‌కే తలమానికం.. గేట్‌వే ఐటీ పార్క్

- రూ.998 కోట్లతో ఐటీ పార్క్
- మారనున్న మేడ్చల్ రూపురేఖలు



మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఏర్పాటు కానున్న ఐటీ పార్క్ నమూనా చిత్రం

మేడ్చల్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి నాలు దిక్కుల ఐటీ పార్క్‌లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో నిర్మించనున్న గేట్‌వే ఐటీ పార్క్ జిల్లాకు తలమానికంగా మారనుంది. ఐటీ పార్క్ పనులు పూర్తయితే జిల్లా మరింత అభివృద్ధి చెందనుంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వల్లే మేడ్చల్‌లో ఐటీ పార్క్ ఏర్పాటు సాధ్యమవుతున్నదని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐటీ పార్క్ నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం.. పనులు ప్రారంభించేలా సంబంధిత కాంట్రాక్టర్లకు పనులను అప్పగించిన విషయం తెలిసిందే. 10 ఎకరాల 12 గుంటల విస్తీర్ణంలో.. రూ.998 కోట్ల వ్యయం.. 22 లక్షల ఎస్ఎఫ్‌టీతో గేట్‌వే ఐటీ పార్క్‌ను నిర్మించేలా ప్రణాళికను రూపొందించారు. ఐటీ పార్క్ ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారి.. మరింత అభివృద్ధి సాధించనుంది.

### గేట్‌వే ఐటీ పార్క్‌లో ఇప్పటికే కంపెనీల రిజిస్ట్రేషన్..

గేట్‌వే ఐటీ పార్క్‌లో కంపెనీలు స్థాపించేందుకు ఇప్పటికే దేశ, విదేశాల కంపెనీలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నాయి. సుమారు 150 పైచిలుకు కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకుని.. ఐటీ కంపెనీలు ఏర్పాటుకు సిద్ధమయ్యాయి. ఇక్కడ 150 ఐటీ కంపెనీలు ఏర్పడితే కండ్లకోయ ప్రాంతమంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. వ్యాపారాలు మరింత అభివృద్ధి చెంది.. వేలాది మంది ఉపాధి పొందే అవకాశం కూడా ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండగా.. ఐటీ పార్క్ పూర్తయితే జిల్లాకు మరింత శోభ రానుంది.

## జిల్లాలో విస్తృతంగా తనిఖీలు..

### రూ.22 లక్షల నగదు సీజ్

సిటీబ్యూరో, నవంబరు 5 (నమస్తే తెలంగాణ ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో తొమ్మిది మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేసి, భారీ స్థాయిలో నగదు, అక్రమ మద్యం పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఆదివారం ఒక్కరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ. 2.93 లక్షల నగదును సీజ్ చేశారు. పోలీస్ అథారిటీ ద్వారా రూ.18.98 లక్ష నగదు సీజ్ చేయగా.. ఇప్పటి వరకు రూ. 47 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు. 590 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీఆర్‌పీసీ కింద 879 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2316 మంది బైండోవర్, 2106 నక్కాస్ ఆపరేషన్స్, 1815 నాన్ బెయిలబుల్ వారంట్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 415 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు.

## మారేడ్‌మిల్లి టూ హైదరాబాద్

### గంజాయి రవాణా- నలుగురి అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): మారేడ్‌మిల్లి నుంచి గంజాయి కొని హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముఠాను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ నిఖితా పంత్ కథనం ప్రకారం.. సంగారెడ్డి గుమ్మిడిదలకు చెందిన మహ్మద్ అర్షద్ ఖాన్, మహ్మద్ ఇర్షద్ ఖాన్ సోదరులు. వీరి స్నేహితులు రమావత్ రాహుల్, మహ్మద్ ముజీర్ అహ్మద్‌తో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడ్‌మిల్లిలో గతంలో గంజాయి కొని, హైదరాబాద్‌లో విక్రయించారు. ఈ క్రమంలోనే నాలుగు రోజుల కిందట మరోసారి అర్షద్, రమావత్ కలిసి మారేడ్‌మిల్లికి వెళ్లి.. అక్కడ సుఖదేవ్ సాదు అనే వ్యక్తికి రూ. 16 వేలు ఇచ్చి, 5.6 కిలోల గంజాయి కొన్నారు. కొత్తగూడెం మీదుగా రైల్లో సికింద్రాబాద్ చేరుకున్నారు. అడ్డగుట్ట వద్ద సిగ్నల్ కోసం రైలు ఆగిన సమయంలో ఇద్దరు రైల్లో నుంచి దిగారు. ఇంతలోనే అక్కడికి చేరుకున్న మిగతా ఇద్దరికి 3.5 కిలోల గంజాయిని రెండు ప్యాకెట్లలో అందజేశారు. వారిద్దరు బైక్‌పై వెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఇద్దరిని విచారించగా మిగతా 2.1 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నలుగురిని అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## గంజాయి స్వాధీనం



హయత్‌నగర్, నవంబర్ 5: వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి ప్యాకెట్లను హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ ఆదేశాల మేరకు సరూర్‌నగర్ ఏఈఎస్ బి.హనుమంతరావు పర్యవేక్షణలో ఉదయం 4 నుంచి 8 గంటల వరకు రామోజీఫిల్మ్ సిటీ వద్ద ప్రైవేట్ వాహనాలు, ట్రక్కులు, బస్సుల తనిఖీలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం, కొడుగు జిల్లా, కొరకొప్ప గ్రామానికి చెందిన కేసీ. గణేశ్ వద్ద మూడు కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.75 వేలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో సరూర్‌నగర్ డీటీఎఫ్ సీఐ టి.సత్యనారాయణ, ఎస్ఐలు జి.హనుమంతు, ఎండీ పాషా, యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగల అరెస్టు- చోరీ సొత్తు స్వాధీనం

### వివరాలు వెల్లడించిన డీసీపీ

అబిడ్స్, నవంబర్5: షాహినాయత్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారివద్దనుంచి రూ. 8,28,700 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సౌత్/వెస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. షాహినాయత్ గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీసీపీ వివరాలను వెల్లడించారు. బేగంబజార్‌లోని బంగ్ జువెల్లర్స్ యజమాని మాధవ బంగ్ శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో బషీర్‌బాగ్‌లో ఉన్న తన మరో బ్రాంచికి కారులో డ్రైవర్ ముజఫర్‌తో కలిసి బయలుదేరాడు. బేగంబజార్‌లోని ఛత్రి ప్రాంతంలో ప్రయాణిస్తుండగా.. గుర్తు తెలియని ఓ వ్యక్తి కారు పక్క నుంచి వచ్చాడు. కారు నుంచి ఆయిల్ కారుతుందని చెప్పాడు. అందోళనతో డ్రైవర్ కారు ఆపి.. బయటకు వచ్చి పరిశీలించగా ఆయిల్ కారడంలేదని.. ఎవరో కారు బంపర్ వద్ద ఆయిల్‌ను రుద్దినట్లు గుర్తించాడు. తిరిగి కారులోకి వచ్చి కూర్చున్నాడు. అయితే, అదే సమయంలో దొంగలు కారు వెనుక డోర్ తెరిచి.. కారులో ఉన్న బ్యాగును దొంగిలించారు. కొద్ది సేపటి తర్వాత కారులో ఉన్న బ్యాగు దొంగతనానికి గురైనట్లు గుర్తించిన బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. బేగం బజార్, బర్తన్ బజార్, అశోక్ బజార్, ఛత్రి, ఉస్మాన్‌గంజ్, నాంపల్లి ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. విశ్వసనీయ సమాచారంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. నిందితులు సౌత్ ఢిల్లీకి చెందిన నరేశ్ కుమార్ అలియాస్ రమేశ్(30), రోనక్(20), శశి కుమార్ అలియాస్ శశి (43) అరెస్టు చేయడంతోపాటు కారు వద్ద నుంచి రూ. 8,28,700 నగదు, సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు బబ్లూ, సూరజ్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, సౌత్/వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ శోభన్‌బాబు ఎస్.ఐ. జి.రాజేశ్వర్ రెడ్డి, ఏఎస్ఐ కె. జగదీశ్వర్ రావు తో పాటు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

### మా బావ రౌడీషీటర్.. ప్రాణాలు తీస్తా

### బాధితుడిని బెదిరింపులకు గురిచేసిన ఛీటర్

వెంగళరావునగర్, నవంబర్ 5 : ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ నిరుద్యోగి నుంచి డబ్బు దండుకున్నారు. ఆ తర్వాత నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ చేతికిచ్చారు. నిజం తెలుసుకున్న బాధితుడు తన డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరాడు. ''మా బావ రౌడీషీటర్.. డబ్బు అడిగితే ప్రాణాలు తీస్తాన''ని బెదిరించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని ఉమేశ్ భాయ్స్ హాస్టల్లో నివాసముండే అనంతపురం జిల్లాకు చెందిన ఎన్.సూర్యప్రకాశ్ నాయక్ నిరుద్యోగి. ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేశాడు. ఈ క్రమంలో శేషు అనే వ్యక్తి ద్వారా కార్తీక్ అతడికి పరిచయమయ్యాడు. టెక్ మహేంద్రలో ఉద్యోగం ఇప్పిస్తానని కార్తీక్ నమ్మబలికాడు. ఉద్యోగం కోసమని ప్రకాశ్ నాయక్ వద్ద నుంచి కార్తీక్ రూ.1,50,000 తీసుకున్నాడు. ఆ తర్వాత నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ అతడి చేతిలో పెట్టాడు. అది నకిలీ లెటర్ అని తేలడంతో తాను మోసపోయానని గ్రహించాడు. తీసుకున్న డబ్బును తనకు తిరిగి ఇచ్చేయాలని సూర్య ప్రకాశ్ నాయక్ పట్టుబట్టడంతో.. కార్తీక్ బెదిరింపులకు గురిచేశాడు. ''రౌడీషీటర్ బిల్లా పవన్ మా బావ.. డబ్బు అడిగితే చంపేస్తానంటూ'' బెదిరించాడు. భయపడిన బాధితుడు మధురానగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

దుండిగల్/ కుత్బుల్లాపూర్, నవంబర్ 5: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ బస్సులో పొరుగు రాష్ట్రానికి మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం ఎస్ఓటీ పోలీసులు పట్టుకొని.. బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలుకు చెందిన పురుషోత్తం ప్రగతినగర్ కమాన్ వద్ద నుంచి 75 మెన్షన్ హౌజ్ బాటిల్స్‌ను ఓ ప్రైవేట్ బస్సులో ఆంధ్రాకు తీసుకెళ్తుండగా ప్రగతినగర్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. హైదరాబాద్ నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి.. ఆంధ్రాలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### రెస్టారెంట్ యజమాని, సూపర్‌వైజర్‌పై కేసు నమోదు...

నిబంధనలకు విరుద్ధంగా ఏలాంటి అనుమతులు లేకుండా రెస్టారెంట్‌లో మద్యం విక్రయిస్తున్న యజమానితో పాటు సూపర్‌వైజర్‌పై ఆదివారం పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాంనారాయణ కథనం ప్రకారం.. కొంపల్లి సినీప్లానెట్ సమీపంలో ఉన్న బఫెలో వైల్డ్ వింగ్స్ రెస్టారెంట్‌లో ఏలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు రెస్టారెంట్‌లో దాడులు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించిన యజమాని మోహన్, సూపర్‌వైజర్ వరుణ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పెరుగుతున్న బీఆర్ఎస్ బలం..

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు



పార్టీలో చేరిన నేతలతో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, నవంబర్ 5 : ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలం పెరుగుతోంది. వివిధ పార్టీల నుంచి నేతలు, కార్యకర్తల చేరికల జోరు కొనసాగుతోంది. వందల సంఖ్యలో యువకులు, మహిళలు, సబ్బండ వర్గాల చేరికలతో బీఆర్ఎస్‌కు నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. దీనితో గులాబీ శ్రేణులు ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. హబ్సిగూడలోని కార్యాలయంలో చిలుకానగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మి, బీరప్పగడ్డకు చెందిన షబ్బీర్ అలీ, బొడ్డు రవీందర్, బొడ్డు రాఘవేంద్రతో పాటు వందలాది మంది యువకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్జీఆర్ఐ ఆటో స్టాండ్ యూనియన్ అధ్యక్షుడు కిషన్ నాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్, ఉపాధ్యక్షులు సాంబ, రవినాయక్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు డా.బీవీ.చారి, కాలేరు జైవీన్, సోమిరెడ్డి, లింగానాయక్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

### హబ్సిగూడ సాయిసుఖ విస్టాస్‌లో సమావేశం..

హబ్సిగూడలోని సాయిసుఖ విస్టాస్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రసంగించారు. కాలనీలు, అపార్ట్‌మెంట్‌వాసులకు అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.